క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులతో ఉపయోగం


వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

బేస్తవారిపేట: వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కథలు చెప్పడం, వినిపించడం, ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిషుపై ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు తెలిపారు.


మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ


తర్లుపాడులో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తర్లుపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సోని ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా నిర్మూలన, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద మురుగు నిల్వ ఉండకుండా చూడాలని మలేరియా యూనిట్ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ తులసీ ప్రసాద్, సూపర్‌వైజర్లు ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన అవసరం

పెద్దారవీడు: పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన అవసరమని గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం, కథలు చెప్పడం, కోలాటం, క్యారమ్స్, చెస్, తదితర ఆటల పోటీలు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని, ప్రతి విద్యార్థి చిన్న నాటి నుంచి గ్రంథాలయానికి రావడానికి అలవాటు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగంతో అనేక మానసిక, శారీరక రుగ్మతలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నీతి కథలు, బాల సాహిత్యం, శతక పద్యాలు, విజ్ఞాన విషయాలు వంటి పుస్తకాలను చదివితే పుస్తక పఠనంపై అభిరుచి, ఆసక్తి పెరుగుతుందన్నారు. ముగింపు కార్యక్రమం రోజు ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేస్తారని తెలిపారు. వేసవి శిక్షణ తరగతులకు 38 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


మార్కాపురం పట్టణం వ్యూ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మార్కాపురంలో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

సర్వత్రా టెన్షన్.. టెన్షన్..

- ఒంగోలులోని రైజ్ కాలేజీలో నేడు ఓట్ల లెక్కింపు
- మెజార్టీపై వైఎస్సార్ సీపీ నేతల ధీమా
- ఉదయం 9 గంటలకు తొలి రౌండ్ ఫలితం!

మార్కాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటలకు ఒంగోలులో ప్రారంభం కానుంది. అభ్యర్థులు మొదలు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఎగ్జిట్ పోల్స్‌లో మెజార్టీ సంస్థలు వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని పేర్కొనడంతో ఆ పార్టీ శ్రేణుల్లో విజయంపై ధీమా మరింత పెరిగింది.

మరికొద్ది గంటల్లోనే ఫలితాలు

మార్కాపురం నియోజకవర్గంలో మే 13న జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 87.58 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,14,608 మంది ఓటర్లు ఉండగా 1,87,952 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజలు ఓటేసేందుకు వినియోగించిన ఈవీఎంలు మంగళవారం ఉదయం 8 గంటలకు తెరుచుకోనున్నాయి. జిల్లా కేంద్రం ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో మూడో అంతస్తులో మార్కాపురం నియోజకవర్గ అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంటుకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ముందుగా 8 గంటలకు పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపు, అనంతరం 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుంది. సుమారు 9 గంటలకల్లా మొదటి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 257 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొదటి పోలింగ్ బూత్ మార్కాపురం మండలం జమ్మనపల్లితో ప్రారంభమై.. చివరి పోలింగ్ బూత్ పొదిలి మండలం ఏలూరుతో ముగుస్తుంది.


కొనకనమిట్ల : చినమనగుండంలో పోలీస్ పికెట్

సంయమనం పాటించండి

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచన

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ మంగళవారం కౌంటింగ్ సందర్భంగా సంయమనం పాటించి ప్రశాంతంగా ఉండాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ మార్కాపురం అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 13వ తేదీన కొద్దిపాటి చిన్న చిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, అదే విధంగా మంగళవారం ఒంగోలులో జరిగే కౌంటింగ్, అనంతరం కూడా పోలీసులు, ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సహకరించి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా తోడ్పాటునివ్వాలని అన్నా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సంయమనంతో ఉండాలన్నారు.

ఎమ్మెల్యే అన్నా నివాసం వద్ద పోలీసు బందోబస్తు

మార్కాపురం: నేడు ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మార్కాపురంలో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు నివాసం వద్ద బారీకేడ్లు ఏర్పాటుచేయడంతోపాటు పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అలాగే జవహర్‌నగర్ కాలనీలోని పలువురు ప్రముఖుల నివాసాల వద్ద కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతోపాటు జవహర్‌నగర్ కాలనీ, పాతబస్టాండు, కంభం సెంటరు, కోర్టుసెంటరు, తూర్పువీధిలోని వైఎస్సార్ విగ్రహం తదితర ప్రాంతాల్లో కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకే పోలీసులు పట్టణంలోని దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలను మూసివేయించారు. మంగళవారం కూడా దుకాణాలు తెరవవద్దని హెచ్చరించారు. పోలీసులకు ప్రజలతో పాటు వ్యాపారులు సహకరించాలని కోరారు.


ఎమ్మెల్యే అన్నా నివాసం వద్ద పోలీసు అధికారుల బందోబస్తు

ఖాకీ నీడలో పశ్చిమ ప్రకాశం

- గ్రామాలు, పట్టణాల్లో 144 సెక్షన్ అమలు
- పోలీస్ పికెట్లతో పటిష్ట బందోబస్తు
- మూతపడిన దుకాణాలు, హోటళ్లు

మార్కాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ ఎం.బాల సుందరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశం మొత్తం 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి షాపును మూసివేయాలని, ఎక్కడా కూడా నలుగురు వ్యక్తులు గుమిగూడి తిరగవద్దని, లాడ్జిల్లో కొత్త వ్యక్తులకు గదులు ఇవ్వవద్దని సూచించారు. ప్రజలందరూ ఇళ్లలోనే ఉండి ఎన్నికల ఫలితాలను వీక్షించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై రౌడీషీట్లు ఓపెన్‌చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు పట్టణాల్లో నాలుగువైపులా గ్రామాల నుంచి ప్రజలెవ్వరూ పట్టణాల్లోనికి రాకుండా పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలువురిపై రౌడీషీట్లు ఓపెన్ చేయడంతోపాటు బైండోవర్ చేశామని, మూడు నియోజకవర్గాల్లోని 40 సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్, నిఘా ఏర్పాటు చేశామన్నారు. మూడు నియోజకవర్గాల్లోని సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30 పోలీసు యాక్టు కూడా మార్కాపురం డివిజన్‌లో అమలులో ఉందని, పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, డీజేలు పెట్టినా, బాణసంచా కాల్చినా కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఒంగోలు నుంచి అదనపు సిబ్బందిని రప్పించి అందుబాటులో ఉంచామని, ఏ సంఘటన జరిగినా నిముషాల వ్యవధిలోనే సంఘటనా స్థలానికి చేరుకుని అల్లర్లను అదుపుచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

మార్కాపురంలో పోలీసు కవాతు

డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం మార్కాపురం పట్టణంలో ఏపీఎస్పీ, బీఎస్ఎఫ్ జవాన్లతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణ పోలీసు స్టేషన్ నుంచి దోర్నాల సెంటరు, నాయుడు బజారు, తేరు బజారు, మెయిన్ బజారు, కంభం సెంటరు మీదుగా కవాతు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో పలుచోట్ల పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

వ్యాపార సంస్థలు మూసి వేయాలి

పొదిలి: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా భద్రతా చర్యల్లో భాగంగా మంగళవారం వ్యాపార సంస్థలు మూతవేసి సహకరించాలని ఎస్సై జి.కోటయ్య కోరారు. 144వ సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. వ్యాపార సముదాయాలు, రెస్టారెంట్లు, హోటళ్లు మూసి వేసి సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు

కొనకనమిట్ల: మండలంలో సమస్యాత్మక గ్రామాలైన చినమనగుండం, చినారికట్ల, పెదారికట్ల, ఇరసలగుండం, నాగరాజుకుంట, నాగంపల్లి, వాగుమడుగు, సిద్దవరంలో సీసీ కెమెరాలతోపాటు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పలు గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

144 సెక్షన్ అమలు

గిద్దలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందర్‌రావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. పట్టణంలోని వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూతవేయాలన్నారు. గుంపులు గుంపులుగా కనబడరాదన్నారు. అల్లర్లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తు బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరి రక్షణ పోలీసుల బాధ్యత అని, అందులో భాగంగానే పోలీసు పల్లె నిద్ర, కార్డెన్ సర్చ్ ద్వారా ప్రతి గృహాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాన్ని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సీఐ వైవీ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందర్‌రావు

సర్వీస్ ఓట్లు ఒంగోలు తరలింపు

- ఆర్‌ఓతో సహా ఒంగోలు వెళ్లిన అధికారులు

మార్కాపురం రూరల్: మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి సర్వీసు ఓట్లను ప్రత్యేక వాహనంలో పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ఒంగోలుకు తరలించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్‌ఓ, సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఏఆర్‌ఓ రవికుమార్, కౌంటింగ్ సిబ్బంది ఒంగోలుకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ తరపున పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, వివిధ పార్టీల ప్రతినిధులు కూడా ఒంగోలు చేరుకున్నారు.


ఒంగోలు వెళ్తున్న ఆర్‌ఓ మీనా తదితరులు

ప్రజలు శాంతియుతంగా ఉండాలి

- మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు

కంభం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు సంయమనం పాటించి శాంతియుతంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు ప్రజలు, నాయకులు ఆవేశాలకు వెళ్లి గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో పోలీసుల నిఘా ఉందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రకాల వ్యాపార సంస్థలు, లాడ్జీలు, హోటల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్ మూసివేయనున్నామని, నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా తెరిచిన, మద్యం విక్రయాలు నిర్వహించినా నిల్వ ఉంచిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు ప్రజానిధులు, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా ప్రజలు శాంతియుతంగా ఉండాలని తెలపడం జరిగిందన్నారు. పోలీసులకు సహకరించాలని సూచించారు, అత్యవసరమైతే తప్పా ఎవరూ బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావాలన్నారు. గెలిచిన పార్టీల నాయకులు బాణసంచా కాల్చడం, రంగులు చల్లడం, విజయోత్సవ ర్యాలీలు చేయడం వంటివి పూర్తిగా నిషేధమని, అటువంటి కార్యక్రమాలకు ఎవరూ పాల్పడకూడదన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సీఐ వీరయ్య , బేస్తవారిపేట ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

సాంస్కృతిక రంగాల్లోనూ ప్రతిభ చాటాలి


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ ప్రతినిధులు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: విద్యతోపాటు సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని తర్లుపాడు ఎంపీడీఓ బి.చంద్రశేఖర్ కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం సంస్థ అధ్యక్షుడు పిన్నిక నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక, శారీరక పరిపక్వతకు పునాదిలాంటివన్నారు. ఈఓపీఆర్‌డీ బాలకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడా, నటన, నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ తీసుకోవడం అభినందనీయమన్నారు. సమాజాభివృద్ధికి కాంక్షించే ప్రతి ఒక్కరూ సేవా సంఘం నిర్వాహకులకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి నేర్పించడంతోపాటు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ పి.వేణు, డాక్టర్ ఎం.మాధవరావు, బి.వెంకటేశ్వర రెడ్డి, నృత్య శిక్షకురాలు లక్ష్మీ ప్రియాంక, శివ యాదవ్, కర్రసాము కోచ్ తాళ్లూరి రాంబాబు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సంస్థ సభ్యులు, విద్యార్థులు యువత పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వరల్డ్ క్లబ్ ఫుట్ దినోత్సవం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సూపరింటెండెంట్ సావిత్రి, వైద్యులు, ఆర్‌బీఎస్ సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో ప్రపంచ క్లబ్ ఫుట్ దినోత్సవం సందర్భంగా ఆర్‌బీఎస్‌కేడీఈఐసీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ పి.సావిత్రి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ భక్తవత్సలం, ఆర్థోపెడీషియన్ డాక్టర్ నాయక్, డీఈసీ సిబ్బంది పాల్గొన్నారు. సూపరింటెండెంట్ సావిత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటల్లో ఈ లోపంతో వచ్చిన పిల్లలకు సరైన వైద్యం అందిస్తున్నామని క్లబ్ ఫుట్ ఇండియా ఎన్జీఓ సంస్థ పిల్లల సైజుకు తగ్గట్టు బూట్లు ఉచితంగా అందిస్తోందన్నారు. డాక్టర్ వెంకటేశ్వరనాయక్ మాట్లాడుతూ.. క్లబ్ ఫుట్ అనేది ఎక్కువగా మేనరికపు వివాహాల్లో అధికంగా వస్తుందని, జన్యుపరమైన రోగాలు, బలహీనమైన నరముల ద్వారా కూడా వస్తుందని అయితే దీనికి పోన్‌సెట్టీ మెథడ్ ద్వారా పిండికట్టు మరియు చిన్నపాటి సర్జరీతో పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. ఇలా చేస్తే వారు తిరిగి మామూలుగా నడవగలుగుతారని చెప్పారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ.. ఈ సమస్యకు చక్కటి పరిష్కారం ఉందని, తల్లిదండ్రులు నాటు కట్లు, వేర్లు, మూలికలు, మందులు వాడి నష్టపోవద్దని చెప్పారు. అనంతరం పాన్‌సెట్టీ మెథడ్ ద్వారా చికిత్స పొందిన పిల్లలు పాల్గొని వారి అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టు సుబ్బారావు, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఏసురత్నం సేవలు అభినందనీయం

ముండ్లమూరు: పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందిన ముప్పంగి ఏసురత్నం సేవలు అభినందనీయమని ఆ శాఖ ఎస్‌పీఎం ఆర్.గణేష్ అన్నారు. స్థానిక పోస్టాఫీసులో సోమవారం ఏసురత్నం, సతీమణి కాంతమ్మను ఘనంగా సన్మానించారు. పోస్టల్ ఉద్యోగులు అమరా వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసులు, చిరంజీవి, మేదరమెట్ల నాగయ్య, బేబీ ప్రయాంక పాల్గొన్నారు.

గనివానిపాడులో జోరు వర్షం

- పలు చోట్ల కోతకు గురైన రహదారులు

కొనకనమిట్ల: నైరుతి రుతు పవనాల రాక, ఆవర్తన ప్రభావంతో సోమవారం తెల్లవారుజామున మండలంలోని గనివానిపాడు, వాగుమడుగు గ్రామాల్లో జోరుగా వర్షం కురిసింది. కుంటలకు నీరు చేరడంతోపాటు గనివానిపాడు నుంచి కలవలపల్లి వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురైంది. వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రహదారిలో చప్టా వద్ద వరద నీటి ప్రవాహానికి రెండు చోట్ల రోడ్డు దెబ్బతింది. రోడ్లు దెబ్బతిన్న విషయం అధికారులకు తెలియజేసినట్లు గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీ సాంబ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షానికి భూములు పదునెక్కడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.


గనివానిపాడు-వాగుమడుగు మధ్య కోతకు గురైన రోడ్డు